సాక్షి చిత్తూరు

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



నేడు పాలిసెట్

పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. - 8లో



పరిశ్రమల స్థాపనకు సౌకర్యాలు

చిత్తూరు జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. - 8లో



ఒకరు కాదు.. నలుగురు!

అధ్యాపకుడే విద్యార్థిగా మారిన సంఘటనలో ఒకరు కాదు.. నలుగురు ఉన్నట్లు సమాచారం .దీనిపై విచారణ సాగుతోంది. - 8లో

న్యూస్‌రీల్

చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా చవ్వా రాజశేఖర్‌రెడ్డి



చవ్వా రాజశేఖర్‌రెడ్డి

తిరుపతి సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా చవ్వా రాజశేఖర్ రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం జిల్లా, అనంతపురం పట్టణానికి చెందిన ఆయన ఎంఏ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై ఆసక్తితో దివంగత వైఎస్సార్ అడుగుజాడల్లో నడిచారు. అనంతరం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేశారు. పార్టీకి విధేయుడిగా అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలను గుర్తించిన పార్టీ ఆయన్ని చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా పార్టీ నియమించింది. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. పదవిని అప్పగించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు.

వైఎస్సార్ సీపీ తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడిగా ఎంపీ మేడా రఘునాథరెడ్డి



మేడా రఘునాథరెడ్డి

తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్ కడప జిల్లా నందలూరు మండలం, చెన్నయ్యగారిపల్లెకు చెందిన ఆయన పారిశ్రామిక వేత్తగా, సీనియర్ రాజకీనాయకుడిగా గుర్తింపు పొందారు. 2024లో ఆయన్ని పార్టీ రాజ్యసభ ఎంపీగా ఎంపిక చేసింది.

గ్రాఫ్టింగ్ ఎక్స్‌లెన్స్

నాసి రకం విత్తనాలు.. నకిలీ నార్లు.. సాగు చేసిన రైతులకు తప్పని కష్టాలు.. వీటి నుంచి గట్టెక్కించి.. కర్షకుడి కష్టం తీర్చి.. నాణ్యమైన నారు..మేలైన పంట.. అధిక దిగుబడి.. గిట్టుబాటు ధర దక్కేందుకు కృషి చేస్తూ.. అంటు కట్టిన మొక్కలను అందజేస్తోంది ఏపీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ విజిటెబుల్స్ అండ్ ఫ్లవర్స్. పుడమిపుత్రులకు అండగా నిలుస్తోంది.

- 90 శాతం సబ్సిడీతో అంటుకట్టిన కూరగాయల నారు
- ఈ ఏడాది 1.20 కోట్ల మొక్కల పంపిణీ
- ఇప్పటికే టమాట, వంగ, కాకర, బీర, కర్బూజ మొక్కలు
- త్వరలో క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యాప్సికం నారు

పలమనేరు: నాసిరకం విత్తనాలతో ఏటా రైతులు పండించిన పంట చేతికి రాక రైతులు నష్టాలు పడుతూనే ఉన్నారు. ఇక ప్రైవేటు నర్సరీలో కూరగాయల మొక్కలు కొందామంటే అధిక ధరల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో మన రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడు రైతులకు అంటుకట్టిన మొక్కలను కుప్పం సమీపంలోని పెద్దబంగారునత్తం వద్ద ఉన్న ఏపీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ విజిటెబుల్స్ అండ్ ఫ్లవర్స్ అందిస్తోంది. ఏపీలోని రైతులు 90 శాతం రాయితీతో అవసరమైన కూరగాయల నార్లను పొందవచ్చు. హైబ్రిడ్ రకాలను అంటుకట్టి రైతులకు అందిస్తోండడంతో ఆ మొక్కలతో సాగు చేసిన రైతులు అధిక పంట దిగుబడులు సాధిస్తున్నారు.

గ్రాఫ్టింగ్ మొక్కలతో పలు లాభాలు

నాణ్యమైన విత్తనాలతో మొక్కలను పెంచి వాటికి హైబ్రిడ్ వంగడాలను అంటుకట్టి పెంచుతారు. తద్వారా ఈ మొక్కలు చీడపీడలను తట్టుకునే స్వభావాన్ని కలిగి ఉంటాయి.

- భూమి ద్వారా మొక్కకు సంక్రమించే వ్యాధులు తక్కువగా ఉంటాయి.
- ఎకరానికి అవసరమైన మొక్కలు సంఖ్య బాగా తగ్గుతుంది.
- ఆరోగ్యవంతమైన మొక్క కారణంగా అధిక పంట దిగుబడి వస్తుంది.
- నాణ్యమైన ఉత్పత్తి కారణంగా రైతులకు గిట్టుబాటు ధర దక్కుతుంది.

ఇప్పటికే 70 లక్షల టమాట మొక్కల పంపిణీ

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా 6 వేల మంది రైతులకు సాహో రకం హైబ్రిడ్ రకం టమాట నారు 70 లక్షల మొక్కలను 90 శాతం సబ్సిడీతో అందజేశారు. దీంతోపాటు మరో 40 లక్షల వంగ, కాకర, బీర, కర్బూజ నార్లను పంపిణీ చేశారు.



టమాట మొక్కకు అంటుకడుతున్న గ్రాఫ్టర్



రైతులకు పంపిణీ చేయడానికి తయారు చేసిన టమాట నారు

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లక్ష్యం ఇదీ..

- కొత్త కూరగాయల మొక్కలను అంటుకట్టడం, అభివృద్ధి చేయడం.
- తక్కువ విస్తీర్ణంలో అధిక పంట ఉత్పత్తులను సాధించడం.
- తక్కువ నీటితో ఎక్కువ పంటసాగు చేయడం.
- క్రాప్ వైజ్ వాల్యూ చైన్ డెవలప్‌మెంట్.
- కొత్త పద్ధతుల్లో నర్సరీ మేనేజ్‌మెంట్ విధానాలు.

త్వరలో మరిన్ని కూరగాయల నార్లు



అంటుకట్టిన వంగ నారు

ఈ సెంటర్‌లో త్వరలో రైతులకు అవసరమైన కాప్సికం, కాలీఫ్లవర్, స్వీట్‌కార్న్ నార్లను సైతం సిద్ధం చేస్తున్నట్లు ఇక్కడి హార్టికల్చర్ అధికారులు తెలిపారు. నారు అవసరమైన రాష్ట్రానికి చెందిన రైతులు సంబంధిత హెచ్ఓ ద్వారా లేఖ తీసుకుని వస్తే, ధర ఉన్న మొక్కను 90 శాతం సబ్సిడీతో రూ.9 పైసలకే రైతులు పొందవచ్చు. ఇతర రాష్ట్రాల రైతులు మాత్రం పూర్తి ధర చెల్లించాల్సి ఉంటుంది. టమాటకు సంబంధించి ప్రైవేటు నర్సరీలో మొక్క రూ.2 నుంచి 3 వరకు డిమాండ్ ఆధారంగా విక్రయిస్తున్నారు. దీంతో రైతులు ఎక్సలెన్స్ సెంటర్‌లో మొక్కలను తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.



పంపిణీకి సిద్ధం చేసిన పలు నారు

నారు కోసం కర్ణాటక నుంచి వచ్చా...



నేను మూడెకరాల్లో టమాట సాగు చేస్తున్నాను. ఇందుకు టమాట మొలకల కోసం కర్ణాటక నుంచి ఇక్కడికి వచ్చా. ప్రైవేటు నర్సరీలో మొక్కలు కొంటే గ్యారెంటీ ఉండదు. అందుకే ఇక్కడ కొచ్చి తీసుకెళుతుంటాం.

– చెన్నమారియప్ప, మల్లసంద్ర, కోలారు

గ్రాఫ్టింగ్ మొక్కతో అధిక దిగుబడి



నేను ఇక్కడ నాలుగేళ్ల నుంచి గ్రాఫ్టర్‌గా పని చేస్తున్నా. అంటుకట్టిన మొక్కలను నాటితే దిగుబడి బాగుంటుంది. అందుకే మూడు రాష్ట్రాలకు చెందిన రైతులు ఇక్కడే కూరగాయల మొక్కలను తీసుకెళుతుంటారు. ఇది పూర్తిగా హార్టికల్చర్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతుంది. నాణ్యమైన సీడ్స్‌తో మొక్కలను పెంచి ఆపై అంటుకడతాం.

– రాశి, గ్రాఫ్టర్, ఎక్స్‌లెన్స్ సెంటర్, కుప్పం

ప్రయోగాలన్నీ రైతుల మేలు కోసమే..



టమాట కాండంగా వంగ, వంగకు కాండంగా మరో మొక్క, ఇలా ప్రయోగాలు చేసి విత్తనాలను మొలకెత్తించిన మొక్కలకు హైబ్రిడ్ రకాలను అంటు కట్టి రైతులకు అందిస్తున్నాం. ఈ సీజన్‌లో 1.20 కోట్ల కూరగాయల మొక్కలను రైతులకు అందజేశాం. అంటుకట్టిన మొక్క సాగుతో మంచి దిగుబడులు వస్తాయి. మేము చేసే ప్రయోగాలన్నీ రైతులకు మేలు చేసేందుకే.

– కోటేశ్వరావు, ఏడీ, సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్, కుప్పం

విత్తనకాయలకు మళ్లీ నివేదికలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లాకు అవసరమైన మేరకు వేరుశనగ విత్తనాలు సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు మళ్లీ కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి మళ్లీ నివేదికలు పంపారు. తొలుత జిల్లాకు 40,338 క్వింటాళ్ల విత్తనాలు కావాలని ప్రతిపాదనలు రూపొందించి, నివేదికలిచ్చారు. ఇందులో విత్తన కాయల సరఫరా కేంద్రం నుంచి కోతలు పెట్టారు. దీంతో జిల్లాలో సమస్యలు వస్తాయని గమనించిన వ్యవసాయశాఖ అధికారులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఆయన సూచనల మేరకు మళ్లీ నివేదికలు ఇచ్చామని శాఖ అధికారులు పేర్కొన్నారు.

జర్నలిస్టులపై దాడుల నివారణకు త్వరలోనే కమిటీ



చిత్తూరులో జెడ్పీ చైర్మన్, కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

చిత్తూరు అర్బన్: పాత్రికేయులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి వీలైనంత త్వరలోనే 'జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీ' ఏర్పాటు చేసి, సమావేశం కూడా నిర్వహిస్తామని చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తిలో 'సాక్షి' రిపోర్టర్ శ్రీనివాసులుపై స్థానిక టీడీపీ నేతలు దాడి చేయడాన్ని ఖండిస్తూ, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లోకనాథన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల పాత్రికేయులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. వీటిని ఆదిలోనే అడ్డుకోవాలంటే జర్నలిస్టులపై దాడుల నివారణ కమిటీ రూపొందించి, నిందితులపై తీసుకుంటున్న చర్యలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి, ఎస్పీతో కలిసి త్వరలోనే కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఇషార్‌అహ్మద్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు శివప్రసాద్, పవన్‌కుమార్, నవీన్, శివ, చంద్ర, రాజేష్, మహేష్, హరీష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చామా..చెప్పామా.. వెళ్లామా!

- మళ్లీ తూతూమంత్రంగా జెడ్పీ సర్వసభ్య సమావేశం
- అన్ని శాఖల్లోనూ నామ మాత్రంగా చర్చ
- సమావేశానికి ఇన్‌చార్జ్ మంత్రి ఎమ్మెల్యేలు డుమ్మా



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: వచ్చామా.. ఏదో చెప్పామా.. వెళ్లామా అనే చందాన తూతూమంత్రంగా సాగింది జిల్లా పరిషత్ మూడో సర్వసభ్య సమావేశం. జెడ్పీ సమావేశ మందిరంలో మూడో సర్వసభ్య సమావేశం మంగళవారం చైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన, సీఈఓ రవికుమార్‌నాయుడు నేతృత్వంలో నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలాల వారీగా తాగునీటి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను పరిష్కారానికి పెద్దపీట వేశామన్నారు. ఎక్కడైన మండలాల్లో బోర్లు, మోటార్లు పాడైతే తమ దృష్టికి తీసుకురావలన్నారు. వెంటనే వాటిని మరమ్మతు చేయడానికి అనుమతులు ఇస్తామన్నారు. అలాగే కురబ సంఘం నాయకుల వినతి మేరకు జెడ్పీ కార్యాలయంలో కనకదాస్ విగ్రహం ఏర్పాటుపై సభ్యుల నుంచి తీర్మానం స్వీకరించారు.

వ్యయం రూ.3.888 కోట్లు

సర్వసభ్య సమావేశం చివర్లో బడ్జెట్ ఆమోదంపై తీర్మానం చేశారు. ఈ బడ్జెట్ ఆమోదంలో 2025–26 వ ఆర్థిక సంవత్సర వ్యయం రూ.3,888 కోట్లుగా ప్రకటించారు. అలాగే ఆదాయం రూ.3,996 కోట్లుగా నిర్దేశించినట్లు జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనా ఆదాయం రూ.4133 కోట్లుగా, వ్యయం రూ.4,039 కోట్లుగా నిర్దేశించారు. అయితే నిర్దేశించిన అంచనాల కంటే తక్కువగా ఈ సంవత్సరం బడ్జెట్ నమోదైంది.

దళిత ఎమ్మెల్యేకు అవమానం

సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని నియోజకవర్గంలో అధికారులు అవమానిస్తున్నారని ఆయన కుమారుడు నారాయణవనం జెడ్పీటీసీ సభ్యుడు సుమన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమూల్ డెయిరీ పరిస్థితి ఏమిటి?

గతంలో అమూల్ డెయిరీలో పాల ధర బాగా ఇచ్చేవారని మదనపల్లె జెడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌కుమార్ అన్నారు. ప్రస్తుతం దాదాపు అక్కడ పాలసేకరణ ఆపివేసినట్లు తెలిసిందన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన డెయిరీ కావడంతో దానిపై కక్షకట్టి రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని విమర్శించారు.

ఫలితాలు తుస్

పది, ఇంటర్ తరగతుల ఫలితాలు గతం కంటే తగ్గాయని శాంతిపురం జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు అన్నారు. పేద, మధ్యతరగతి పిల్లలు ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్నారన్నారు. కానీ అక్కడ ఫలితాలు చూస్తే భయమేస్తోందన్నారు.

ఆర్ఎంపీలదే రాజ్యం

కుప్పం నియోజకవర్గంలో ఆర్ఎంపీ వైద్యులదే రాజ్యంగా మారిందని కుప్పం జెడ్పీటీసీ సభ్యుడు శరవణ ఆరోపించారు. 108 వాహనంలో వసతులు లేవని పాకాల జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి తెలిపారు. సదుం మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో అనవసరంగా నిర్మిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి ఆరోపించారు. గుడుపల్లె మండంలోని పలు పాఠశాలల పనులు మధ్యలో ఆగిపోయాయని జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. పీలేరు మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ పాడైతే రేణిగుంటకు వెళ్లి తెచ్చుకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారని ఎర్రావారిపాళెం జెడ్పీటీసీ సభ్యుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. సోలార్ అదనపులోడ్ క్రమబద్ధీకరణకు రెస్కో అధికారులు డబ్బులు కట్టించుకుని, ఇవ్వలేదని రామకుప్పం జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రాఘవ్ తెలిపారు. పాలసముద్రం మండలంలో కరెంటు స్తంభాలు వాలిపోయాయని పాలసముద్రం జెడ్పీటీసీ అన్బలగన్ తెలిపారు. విశ్వతమాల పంచాయతీలో జరిగిన పలు పనుల్లో రూ.2 కోట్లు అవినీతి జరిగిందని ఏర్పేడు జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య ఆరోపించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, తిరుపతి డీఆర్వో నరసింహులు, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య తదితరులు పాల్గొన్నారు. కాగా జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి సభ్యులు కానీ వారు హాజరయ్యారు. అలాగే జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ వ్యక్తిగత కెమెరామెన్ వీడియో తీస్తూ హల్‌చల్ చేశారు.

ప్రభుత్వాస్పత్రులు అధ్వాన్నం: ఎమ్మెల్యే థామస్

జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులు అధ్వాన్నంగా ఉన్నాయని జీడీ నెల్లూరు కూటమి ఎమ్మెల్యే థామస్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఇటీవల తలకు దెబ్బతగిలి ఒక మహిళ చేరితే సీటీ స్కాన్ చేయకుండా పంపేశారన్నారు. మరుసటి రోజు ఆమె మరణించిందన్నారు. కాగా సర్వ సభ్య సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు జెడ్పీటీసీ సభ్యులు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రశ్నల వర్షం కురిపించారు.

పొంతన లేని అజెండా.. చర్చ

సర్వసభ్య సమావేశంలో స్టేజీపైనా పలు శాఖల అధికారులు ప్రసంగించిన అంశాలు.. అజెండాలోని అంశాలకు పూర్తిగా వ్యత్యాసం ఉండడంతో సభ్యులు తికమకపడ్డారు. అజెండాలో పలు శాఖలు ఇచ్చిన వివరాలు రెండు నెలలు ముందువే కావడంతో సభ్యులు ఇదేమి తీరని మండిపడ్డారు. సభ్యులకు తాజా సమాచారం ఇవ్వకుండా మోసం చేయటమేమిటని ప్రశ్నించారు. అలాగే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి, అన్నమయ్య జిల్లాల సమాచారాన్ని సభ్యులకు తెలియజేయకుండా కేవలం చిత్తూరు జిల్లాలో 32 మండలాల సమాచారాన్నే వివరించడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

- " పలమనేరులోని ఊసరపెంటకు చెందిన భాస్కరనాయుడు కుమార్తె హేమావతి అదే గ్రామానికి చెందిన దళిత యువకుడు కేశవను ప్రేమించింది. పెళ్లికి యువతి తరఫున అంగీకరించకపోవడంతో వాళ్లను కాదని వివాహం చేసుకున్నారు. తిరుపతిలో కాపురం పెట్టారు. ఏడాది తరువాత హేమావతి మగబిడ్డకు జన్మనిచ్చింది. కాన్పు అనంతరం భార్య, బిడ్డను ఇంటికి తీసుకెళుతుండగా భర్త ఎదుటే భాస్కర నాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి హేమావతి మెడకు తాడు బిగించి కన్న కూతుర్ని కడతేర్చాడు." – 2019, జూన్
- "యాస్మిన్ భాను. ఎంబీఏ పూర్తి చేసి, సాయితేజ అనే దళిత యువకుడిని ప్రేమించి పెద్దలను ఎదిరించి పెళ్లాడింది. సరిగ్గా రెండు నెలల తరువాత తండ్రి డిప్రెషన్‌లో ఉన్నాడని, చూసి వెళ్లాలని ఫోన్ రావడంతో చిత్తూరులోని బాలాజీ కాలనీకి బయలుదేరింది. కారులో ఎక్కించుకున్న తండ్రి షౌకత్ అలీ, మరో ఇద్దరు బంధువులు.. తాము సూచించిన వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశారు. యాస్మిన్ ఒప్పుకోకపోవడంతో, ఆమె కాళ్లను తొక్కిపెట్టిన తండ్రి ఓ తాడుతో మెడకు రెండు చుట్లు వేసి హత్య చేసి.. కర్కశంగా కన్నపేగును తెంచేశాడు." – పది రోజుల క్రితం

ఈ రెండు ఘటనల్లోనూ కనిపిస్తున్న సాధారణ అంశం.. కులాంతర వివాహాలు. వీటి నుంచి తమ పెద్దరికాన్ని కాపాడుకోవడానికి కన్న వాళ్లే ప్రాణాలు తీసే యముళ్లుగా మారుతున్నారు. పరువు హత్యలకు పూనుకుంటున్నారు. పెద్దలను ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్నందుకు కన్న కూతుర్ని హత్య చేయడంతో పోయిన పరువు తిరిగి వచ్చిందా..? అసలు కులాంతర వివాహం చేసుకుంటే పరువు పోయిందా..? అసలు పరువు అనే పదానికి ఈ తరంలో చోటు ఉందా..? పరువు హత్యలతో జైలు జీవితం కాకుండా, సాధించింది ఏమైనా ఉందా..? అని ప్రశ్నించుకుంటే అసలు పరువు హత్యల జోలికి ఏ ఒక్కరూ వెళ్లరు.

ఆ హత్యలే పరువు తీస్తున్నాయ్..!

- కులాంతర ప్రేమ వివాహాలు జీర్ణించుకోలేని పెద్దలు
- క్షణికావేశంలో కన్నపిల్లల్ని కడతేర్చుతున్న పోకడ
- ప్రాణం తీశాక జైల్లో ఊచలు.. రోడ్డున కుటుంబం
- పరువు హత్యల్లో మారాల్సింది పెద్దల ఆలోచనలు





యాస్మిన్‌భాను మృతదేహం

చిత్తూరు అర్బన్: ప్రస్తుతం నడుస్తున్నది ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)తో కూడుకున్న ఆధునిక సమాజం. ఇక్కడ ఎవరి గురించి, ఎవరూ పట్టించుకునేంత సమయం లేదు. అది పట్టణమైనా, పల్లెటూరైనా సరే. ఈ ఆధునికీకరణ సమాజంలో అసలు పరువు అనే పదానికి చోటే లేదు. పక్కవాడు మన గురించి ఏమనుకుంటాడో..? 24 గంటలు మనల్ని నిశితంగా పరిశీలిస్తూ, మనం చేసే పనులకు మార్కులు వేస్తాడా..? అనే ప్రశ్నలకు ఇక్కడ తావులేదు. ఇక్కడ ఎవరి పనులు వాళ్లవి. కాలంతోపాటు పరుగెత్తుతున్న మనుషులు పరువు గురించి పట్టించుకోవడం ఎప్పుడో మానేశారు.

ఆలోచనలు మారాలి..

మొన్న భాస్కర నాయుడు, నిన్న షౌకత్ అలీ.. పేర్లు ఏవైనా వీరిద్దరూ తమ పిల్లల్ని చంపేసిన తండ్రులుగా సమాజంలో నిలిచిపోయారు. పైగా పలమనేరు, చిత్తూరులో జరిగిన పరువు హత్యల అనంతరం, వాటిని ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసి పోలీసులకు దొరికిపోయారు. ఈ కేసులు కోర్టులో రుజువైతే జీవిత ఖైదు నుంచి ఉరిశిక్ష వరకు శిక్ష పడే అవకాశం ఉంది. చిత్తూరులో యాస్మిన్‌ను హత్య చేశాడనే ఆధారాలు సేకరించిన పోలీసులు షౌకత్‌అలీని జైలుకు తరలించారు. ఇప్పుడు అతని భార్య, పిల్లలు రోడ్డున పడ్డారు. అసలు ప్రేమ పెళ్లి చేసుకుంటే ఎదురయ్యే ఆర్థిక, సామాజిక పరమైన ఇబ్బందులను తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలి. అప్పటికే ప్రేమ వివాహంపైనే ఆసక్తి ఉంటే.. సమాజంలో ఎలా ధైర్యంగా నిలబడాలో పిల్లలకు నేర్పించాలి. అంతేతప్ప, పిల్లల ప్రాణాలు తీసే అధికారం తమకు లేదనే నిజాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి. పిల్లలు సైతం తాము మేజర్లు, తమ ఇష్టం వచ్చినవారిని పెళ్లాడుతామని కాకుండా.. తల్లిదండ్రుల అభిప్రాయాలు కూడా పరిగణలోకి తీసుకుని వారి అనుమానాలను నివృత్తి చేయాలి. ప్రేమ పెళ్లి చేసుకున్నా జీవితంలో సంతోషంగా ఉంటామనే ధైర్యాన్ని ఇవ్వాలి. రెండు వైపులా ఆలోచనా విధానాలు మారితే తప్ప.. పరువు హత్యలనే పదం మాసిపోదు.



హేమలత మృతదేహం

ఈకేవైసీకి నేడు తుది గడువు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రేషన్‌కార్డు ఈకేవైసీ గడువు బుధవారంతో ముగియనుంది. రేషన్‌కార్డులోని ప్రతి సభ్యుడు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెండు నెలలుగా ఈ ప్రక్రియసాగుతోంది. కార్డులోని సభ్యులందరూ డీలర్ల వద్ద ఈకేవైసీ చేయించుకునేలా అవకాశం కల్పించింది. ఈ గడువు బుధవారంతో ముగియనుంది. అయితే ఇంకా 1.06 లక్షల మంది ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్నట్లు డీఎస్ఓ శంకరన్ తెలిపారు. గడువులోపు ఈకేవైసీ చేయించుకోవాలని డీఎస్ఓ తెలిపారు.

క్లుప్తంగా

ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నేతలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల డిమాండ్లను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగులు రెండో రోజు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెకు సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏపీ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్, ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్, నాయకులు వినోద్, మమత, శ్రీవాణి, అనిత పాల్గొన్నారు.

2న కలెక్టరేట్ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న గంగరాజు

చిత్తూరు కార్పొరేషన్: తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం మే 2వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గంగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం చేసుకున్న తల్లులను సురక్షితంగా వాహనాల్లో ఇంటికి చేర్చే డ్రైవర్ల సమస్యలు తీర్చడం లేదన్నారు. వాహనాలను మరమ్మతు చేయడం లేదన్నారు. తల్లీబిడ్డల సంరక్షణ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు పాలిసెట్

పలమనేరు: పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న పాలిసెట్ ఎంట్రెన్స్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్టు స్థానిక పాలిసెట్ కో–ఆర్డినేటర్ మహమూద్ తెలిపారు. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల, మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న బాలికోన్నత పాఠశాల, గుడియాత్తం రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హైస్కూల్, మదనపల్లె రోడ్డులోని సాయి శ్రీచైతన్య కళాశాల సెంటర్లలో నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు 1626మంది విద్యార్థులు రాయనున్నట్టు తెలిపారు. ఇక్కడి సెంటర్లలో ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలను ఎస్వీయూ రీజియన్ ఆర్‌జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ, జిల్లా కో–ఆర్డినేటర్ జగన్నాథరావు, జిల్లా పరిశీలకులు సుబ్బన్న పరిశీలించారు. ఇప్పటికే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థులు సంబంధిత సెంటర్లకు గంట ముందుగా చేరుకోవాలని వారు సూచించారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం ఐదుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు జాయింట్ సూపరింటెండెంట్లు, ఆరుగురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, వందమంది ఇన్విజిలేటర్లు,40మంది అసిస్టెంట్లు, ఏడుగురు అబ్జర్వర్లు నియమితులయ్యారని, వీరంతా ఆర్డీఓ పర్యవేక్షణలో ఉంటారన్నారు.

రెక్కలు తెగిన ఈగల్..!

ఈగల్.. పక్షి జాతిలో విభిన్నం.. ఎత్తుకు ఎగిరే కొద్దీ చిన్న జీవినైనా పసిగట్టి..వేటాడే శక్తి ఈ పక్షికి ఉంది. ఆ పక్షిలా పసిగట్టి మాదకద్రవ్యాల నివారణకు ఈగల్ పేరుతో రాష్ట్రంలో టాస్క్‌ఫోర్సును కూటమి సర్కార్ ఏర్పాటు చేసింది. అత్యుత్తమ లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఈగల్ రెక్కలు తెగిన పక్షిలా మారింది. ఫలితంగా జిల్లాలో మాదకద్రవ్యాల విక్రయం, రవాణా విచ్చలవిడిగా సాగుతోంది.

- మాదక ద్రవ్యాల కట్టడిపై కూటమి ప్రగల్భాలు
- జిల్లా మొత్తానికి ఓ ఎస్ఐ.. ఆరుగురు సిబ్బంది
- ఇలాగైతే గంజాయి..మత్తు పదార్థాలను అరికట్టినట్టే
- ఈగల్ బృందంలో ఆరోపణలున్న వాళ్లకు చోటు



చిత్తూరులో పట్టుబడ్డ గంజాయి (ఫైల్)

చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు 'ఎలైట్ యాంటీ–నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈగల్)'ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మత్తు పదార్థాలను పట్టేస్తామని, నిందితులకు చుక్కలు చూపిస్తామని ఉత్తర ప్రగల్బాలు పలికింది. కానీ క్షేత్రస్థాయిలో చూస్తే.. ఈగల్ చూడ లేక, ఎగర లేక కుక్కినపేనులా పడుంది.

పట్టడానికేనా..?

జిల్లాలో ఇప్పటికే ఈగల్ బృందం ఏర్పాటైంది. దీనికి ఓ ఎస్ఐతో పాటు ఆరుగురు సిబ్బంది ఉన్నారు. జిల్లాలో ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోనైనా ఈగల్ బృందం మాదకద్రవ్యాలపై దాడులు చేయవచ్చు. చిత్తూరు నగరంలో విచ్చలవిడిగా వీధివీధికి గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. పూతలపట్టు గంజాయి రవాణాకు స్టాక్ పాయింట్‌గా నిలుస్తోంది. గంజాయి బెంగళూరు తరలడానికి పలమనేరును దాటించడంలో నిందితులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. కానీ ఈగల్ ఏర్పాటయ్యాక జిల్లాలో పెద్దగా ఎక్కడా నిందితులను పట్టుకున్న దాఖలాలు లేవు. సొంతంగా కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేసింది లేదు. పోనీ పాత కేసుల్లో పేరు మోసిన వ్యక్తులపై నిఘా ఉంచారా..? అంటే సమాధానం లేదు. అసలు ఈగల్ బృందంలోని సిబ్బందికి కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం, మెలకువలు, నిందితుల డేటా విశ్లేషణ, ఆర్థిక లావాదేవీలపై కనీస పరిజ్ఞానం కూడా లేనట్టు తెలుస్తోంది. ఇటీవల మురకంబట్టులో ఈగల్ బృందం పందెం కోళ్లను పట్టుకోవడమే వీళ్ల పనితీరుకు నిదర్శనం. ఇందులో పనిచేసే అధికారులు, సిబ్బందికి 30 శాతం అలవెన్సు సౌకర్యం కల్పించడంతో, గతంలో సస్పెన్షన్లకు గురైన వాళ్లను కూడా అనుభవజ్ఞులుగా ఈగల్‌లో పెట్టుకోవడం విమర్శలకు తావిస్తోంది.



నిఘా బలోపేతమైతేనే..

జిల్లాకో నార్కొటిక్ కంట్రోల్ విభాగం ఏర్పాటు చేశామని చెప్పిన ప్రభుత్వం చిత్తూరులో ఇది ఎక్కడ ఉందో చెప్పనేలేదు. పైగా ఈగల్ కేసుల విచారణకు తిరుపతిలో ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామన్న హామీ ఉత్తర ప్రగల్భాల్లా కనిపిస్తోందే తప్ప.. ఇప్పటి వరకు ఏం చర్యలు చేపట్టారన్నది ప్రశ్నార్థకం. ప్రతి కాలనీ, గ్రామస్థాయిలో మాదక ద్రవ్యాల వినియోగంపై నిఘా ఉంచి, సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవడం, పాఠశాలలు, కళాశాలల స్థాయిలో పౌరులను ఇందులో బాధ్యులుగా చేస్తూ గంజాయి విక్రయాలు, ఉపయోగాలపై రహస్యంగా సమాచారం తెప్పించుకోవడం చేయాలి. పాత కేసుల్లో నిందితుల కదలికలు..? ఇప్పుడు ఏం చేస్తున్నారు..? కొన్ని స్టేషన్ల పరిధిలో పట్టుబడుతున్న మాదక ద్రవ్యాల కేసుల్లో విశ్లేషణాత్మకమైన దర్యాప్తు..? లాంటి వాటిని అధిగమిస్తేనే ఈగల్‌కు ప్రాణం వచ్చినట్లవుతుంది. అలా చేయనిపక్షంలో జిల్లా పోలీసుశాఖలో 'ప్రత్యేక విభాగం' ఎలాగైతే స్తబ్దుగా ఉందో 'ఈగల్' కూడా ఓ మూలన కూర్చోక తప్పదు.

లక్ష్యం పెద్దది!

మాదక ద్రవ్యాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో 'ఈగల్'ను తీసుకొచ్చింది. గంజాయి స్మగ్లింగ్, మత్తు పదార్థాల వినియోగం, మత్తెక్కించే రసాయనాల నియంత్రణ, డ్రగ్స్ కట్టడికి ప్రతి జిల్లాలో ఈగల్ పని చేయనున్నట్లు పేర్కొంది. మత్తు పదార్థాలు ఎక్కడైనా ఉపయోగించినా, స్మగ్లింగ్ చేసినా సమాచారం ఇవ్వడానికి ఫోన్–1972 అనే ఉచిత టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్ర స్థాయిలో ఐజీ స్థాయి అధికారిని నియమించిన ప్రభుత్వం.. జిల్లాల్లో ఎస్పీలకే పర్యవేక్షణ బాధ్యత అప్పగించింది.

నేటి నుంచి జిల్లాలో స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్



రమణమూర్తి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బుధవారం నుంచి స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ రమణ మూర్తి తెలిపారు. ఆయన తన కార్యాలయంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ నెల 4న తొలుత జిల్లా కేంద్రంలోని ఆ ర్వో (అర్బన్)కార్యాలయంలో ప్రయోగాత్మకంగా ఈవిధానాన్ని అమలు చేశామన్నారు. ప్రక్రియ సజావుగా జరుగుతుండడంతో ఈనెల 30 నుంచి మిగిలిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నమన్నారు. క్రయ, విక్రయదారులు ముందుగా వారు కోరుకున్న తేదీ, సమయంలో స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. వారికి నిర్దేశించిన సమయంలో నేరుగా కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకుని వెళ్లవచ్చని చెప్పారు. దీంతో సమయం ఆదా అవుతుందన్నారు. చిత్తూరు రూరల్, బంగారుపాళెం, పలమనేరు, పుంగనూరు, కుప్పం, కార్వేటినగరం, నగరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇక స్లాట్ బుకింగ్ ద్వారా పనులు చేసుకోవచ్చన్నారు. చిత్తూరు ఆర్వో కార్యాలయం మినహా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజు 39 స్లాట్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు. చిత్తూరు ఆర్వోలో 78 స్లాట్స్ వెసులుబాటు ఇచ్చారన్నారు. నిర్దేశించిన సమయంలో బుక్ చేసుకున్నవారు వచ్చినా, రాకున్నా మరొకరికి అవకాశం ఇవ్వరన్నారు. స్లాట్‌ను రీ షెడ్యూల్ చేసుకోవాలంటే రూ.200 రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓగా శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: డీఎల్‌పీఓ పార్వతి బుధవారం ఉద్యోగవిరమణ చేయనున్నారు. దీంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జ్‌గా పూతలపట్టు డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసులును నియమించారు. మే 1 నుంచి ఈయన ఇన్‌చార్జ్‌గా కొనసాగనున్నారు.

పరిశ్రమల స్థాపనకు మెరుగైన సౌకర్యాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల స్థాపనకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఉపాధి అవకాశాల పెంపునకు పరిశ్రమల స్థాపన ముఖ్యమన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనకు అవసరమైన నైపుణ్యాలకు శిక్షణలు కల్పించాలని తెలిపారు.

ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈలు

జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించినట్లు తెలిపారు. ఇదివరకే పరిశ్రమల స్థాపనకు భూమి కేటాయింపులు చేసుకున్న వారు పరిశ్రమలను స్థాపించే దిశగా ముందుకు సాగాలన్నారు. జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రూ. 557 కోట్లతో 61,619 మందికి ఉపాధి కల్పించేలా 15,371 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉదయం పోర్టల్‌లో దరఖాస్తులు స్వీకరించారన్నారు.

222 అనుమతులు మంజూరు

జిల్లా వ్యాప్తంగా సింగిల్ డెస్క్ పోర్టల్‌లో 2025 మార్చి 5 నుంచి 2025 ఏప్రిల్ 26వ తేదీ వరకు 234 దరఖాస్తులు స్వీకరించగా 222 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో జీఎం ఇండస్ట్రీస్ వెంకట్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్‌డీఎం హరీష్, డీపీఓ సుధాకర్‌రావు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్, జిల్లా పండ్ల సమాఖ్య సభ్యులు బాబీ, ఎస్ఎస్‌సీసీఐ చైర్మన్ డేవిడ్ బ్రెయినార్డ్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్ఎం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రైల్వేస్టేషన్‌ను మంగళవారం సాయంత్రం డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) చంద్రశేఖర్‌గుప్త పరిశీలించారు. కాణిపాకం దర్శనార్థం చిత్తూరుకు వచ్చిన ఆయన వచ్చారు. తిరుగు ప్రయాణంలో స్టేషన్‌ను తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను చూసి పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో రైల్వే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌గుప్త

తనిఖీలు మెరుగ్గా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ ముత్తుస్వామి, ఆర్పీఎఫ్ సీఐ కుమార్, జీఆర్పీ ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

కృతజ్ఞతాభావమే సనాతన ధర్మం

పుత్తూరు: కృతజ్ఞతాభావమే సనాతన ధర్మం అని ఉడిపి పీఠాధిపతి శ్రీఈశాప్రియ తీర్థ స్వామీజీ పేర్కొన్నారు. ఉడిపి మఠం నుంచి పాదయాత్రగా వస్తున్న స్వామీజీ మంగళవారం సాయంత్రం పుత్తూరు చేరుకున్నారు. స్థానిక ఈశ్వరాలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణమందిరంలో స్వామీజీ ఉపన్యసిస్తూ శివ నామస్మరణతో అంతఃకరణ శుద్ధి ఏర్పడుతుందని తద్వారా వైరాగ్యం ఏర్పడి జ్ఞానం వైపు నడుస్తామని వెల్లడించారు. ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించారు. మనం తీసుకుంటున్న గాలి, నీరు, భోజనం ఎవరి ద్వారా వచ్చిందో వారిపై కృతజ్ఞతాభావంతో ఉండాలని అప్పుడే సనాతన ధర్మాన్ని కాపాడగలమని ఉద్బోధించారు. మనం భూమీదకు వచ్చిన తాత్కాలిక సందర్శకులం మాత్రమేననే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని తెలిపారు. భారతదేశం గురించి తెలుసుకోవాలని, శరీరమనే క్షేత్రాన్ని ఎలా శుద్ధిగా ఉంచుకోవాలనే విషయాన్ని తెలియజేయాలని, సనాతన ధర్మం వైపు ఎలా నడవాలని పూర్వీకులు చెప్పిన విషయాలను తిరిగి తెలియజెప్పాలని, శాస్త్రాలు చదవడంతో పాటు దేశాన్ని పర్యటించడంతో జ్ఞానం కలుగుతుందనే ఉద్దేశంతో పాదయాత్రను ప్రారంభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో హిందూ సేవా సమితి సభ్యులు బాలకృష్ణారెడ్డి, మురళీకృష్ణ, నాగభూషణం, కోటకొండ బాబు, సుబ్రమణ్యం, రామకృష్ణ, రమేష్ పురోహితులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీఈశాప్రియ తీర్థ స్వామీజీ

ఒకరు కాదు...నలుగురు!

- డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల బీఈడీ లీలలు
- బీఈడీ విద్యార్థులుగా మారిన అధ్యాపకులు
- ఎస్వీయూ అధికారుల విచారణ ప్రారంభం



బంగారుపాళెంలోని ప్రైవేటు బీఈడీ కళాశాల

పలమనేరు: అధ్యాపకుడే విద్యార్థిగా మారిన ఘటనలో ఒకరు కాదు నలుగురు ఉన్నట్లు సమాచారం. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ అధ్యాపకుడు బంగారుపాళెంలోని ఓ ప్రైవేటు బీఈడీ కళాశాలలో విద్యార్థిగా మారి, పలమనేరు డిగ్రీ కళాశాల సెంటర్‌లోనే బీఈడీ పరీక్షలు రాస్తున్న విషయం తెలిసిందే. దీనిపై సాక్షి దినపత్రికలో ఈనెల 27న 'ఇక్కడ అధ్యాపకులు.. అక్కడ విద్యార్థులు' అనే శీర్షికన కథనం వెలువడిన విషయం విదితమే. ఇలా ఉండగా ఇదే కళాశాలకు చెందిన రెగ్యులర్, కాంట్రాక్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు సైతం ఇక్కడ విధులు నిర్వహిస్తూ జీతాలు పొంది, అక్కడి బీఈడీ కళాశాలలో విద్యార్థులుగా ఇప్పుడు ఇదే సెంటర్‌లో బీఈడీ పరీక్షలు రాస్తున్నట్టు తెలిసింది. దీనిపై ఎస్వీయూ అధికారుల విచారణ చేస్తున్నట్టు సమాచారం.

అక్కడా.. ఇక్కడా హాజరు ఎట్లా..

ప్రైవేటు బీఈడీ కళాశాలలో కనీసం 40 శాతం హాజరున్న విద్యార్థులను ఆపై కొంత అపరాధంతో నిర్వాహకులు పరీక్షకు అనుమతిస్తుంటారు. అయితే ప్రభుత్వ కళాశాల అధ్యాపకులే అక్కడ విద్యార్థులు కావడంతో ప్రైవేటు కళాశాల యాజమాన్యం వారి హాజరుపై ఏదోలా మ్యానేజ్ చేసిందనే మాట వినిపిస్తోంది. దీంతో ఏడాదిలో కనీసం 150 రోజులైనా వీరు ప్రైవేటు కాలేజీకి వెళ్లి ఉండాలి. అలాంటప్పుడు పలమనేరులో వారు విధులకు గైర్హాజరు అయి ఉండాలి. కానీ అలా జరగలేదు. వీరు ఇక్కడి కళాశాల పనిదినాల్లో పనిచేసినట్టుగానే నమోదైనట్టు తెలుస్తోంది. దీంతో విచారణ చేసే అధికారులకు ఏమి సమాధానం చెప్పాలో అర్థంగాక కళాశాల ప్రిన్సిపల్ తలపట్టుకుంటున్నట్టు సమాచారం.

పది మంది వరకు ఉద్యోగులు...

బంగారుపాళెంలోని ప్రైవేటు బీఈడీ కళాశాలలో పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పలువురు అధ్యాపకులతోపాటు జిల్లాలోని పది మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులు బీఈడీ విద్యార్థులుగా ఉన్నట్టు సమాచారం. దీనిపై సైతం యూనివర్సిటీ అధికారులు విచారిస్తున్నట్టు తెలుస్తోంది.

అదనపు జీతమొస్తుందని..

పీజీ, పీహెచ్‌డీలతో అధ్యాపకులైన వీరు బీఈడీ, ఎంఈడీ డిగ్రీలుంటే అదనపు జీతమొస్తుందనే ఇలా డ్యూయెల్ రోల్ చేస్తున్నట్టు మేధావులు చెబుతున్నారు.

గాడి తప్పిన పరీక్షల నిర్వహణ

ప్రైవేటు కళాశాలల బీఈడీ పరీక్షలు ఓపెన్ స్కూల్ పరీక్షల్లా మారాయనే మాట గట్టిగా వినిపిస్తోంది. ఇష్టానురాజ్యంగా అనుకూలమైన చోట సెంటర్లను తెచ్చుకోవడం మొదలు మాస్ కాపీయింగ్ షరా మామూలుగా మారింది. బీఈడీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో పాటు అదే సెంటర్‌లోని అధ్యాపకులు పరీక్ష కలిసి రాస్తుండడంతో పరీక్షల తీరు గాడి తప్పిందనే విమర్శలున్నాయి. చిత్తూరు సెంటర్‌లో ఒకే బల్లపై ముగ్గురు విద్యార్థులు పరీక్షలు రాయడం, మాస్ కాపీయింగ్‌తో పరీక్షలంటేనే నమ్మకం పోయింది. ఇలా పరీక్షలు రాసి పాసై, రేపు ఉద్యోగాలు పొందే వారు పిల్లలకు ఎలా పాఠాలు చెబుతారో ఎస్వీయూ అధికారులే ఆలోచించాలి. ఈ విషయమై స్థానిక ప్రిన్సిపాల్ వెంకటేశును వివరణ కోరగా ఇక్కడున్న అధ్యాపకులు బీఈడీ విద్యార్థులుగా ఇదే సెంటర్‌లో పరీక్ష రాస్తున్న విషయం సాక్షిలో వచ్చే వరకు తెలిదని, ఇప్పుడు విచారిస్తున్నామని చెప్పడం కొసమెరుపు.

ప్రభుత్వ బడుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ప్రభుత్వ బడుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో బదిలీల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ ప్రాథమిక పాఠశాల వ్యవస్థను ఫౌండేషన్, బేసిక్, మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేసిందన్నారు. ఫౌండేషన్ పాఠశాలలో ఒక రకంగా, బేసిక్ ప్రాథమిక పాఠశాలలో వేర్వేరుగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను కేటాయించడం సరికాదని మండిపడ్డారు. ఫౌండేషన్ పాఠశాలల్లో 1:20గా సెకండరీ గ్రేడ్ టీచర్లను నియమించాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులతో సంబంధం లేకుండా ఐదుగురు ఉపాధ్యాయులు, ఐదు తరగతి గదులు, ప్రత్యేక నిధులు కేటాయించాలని వెంకటేశ్వర్ డిమాండ్ చేశారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు, రేషనలైజేషన్ పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఏ ఒక్క ఉపాధ్యాయుడికి అన్యాయం జరగకుండా పిల్లలకు నాణ్యమైన విద్య అందించేలా సర్దుబాటు ప్రక్రియ చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో రోజుకు ఒక రకమైన కసరత్తు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కసరత్తుతో టీచర్లలో గందరగోళం నెలకొంటుందన్నారు. టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండస్ కోరారు. వారు మాట్లాడుతూ ఏప్రిల్ 24 నుంచి మే 30వ తేదీ వరకు జరుగుతున్న బదిలీలు, ఉద్యోగోన్నతులు ,రేషనలైజేషన్‌కు సంబంధించి టీచర్లకు ఏ సమస్యలొచ్చినా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.సుధాకర్‌రెడ్డి, సహాధ్యక్షులు కె.రెడ్డెప్పనాయుడు, ఎస్ రెహానాబేగం, కోశాధికారి కె. ప్రసన్న కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్ పి బాషా, పీఆర్ మునిరత్నం, జిల్లా కార్యదర్శులు సీపీ ప్రకాష్, డి. ఏకాంబరం, బి. ఈశ్వర్ మహేంద్ర, కె. సరిత తదితరులు పాల్గొన్నారు.